
మనిషిపుట్టిన తర్వాత వయసూ రాక మానదు, వయసుతో బాటు కోరికలూ రాకమానవు. నా చదువు పూర్తయి, ఉద్యోగంలో చేరిన తర్వాత మా కుటుంబ వివాహవ్యవస్థలో కొన్ని మార్పులు తీసుకువద్దామని ధైర్యం చేసి, మా ఆఫీసులో పన్జేసే జాహ్నవిని ప్రేమించాను. అది



ఏకపార్శ్వం కాకుండా ద్విపార్శ్వం కావడంతో మొదటిసోపానం అధిరోహించగలిగాను.

మాఘమాసపు మొదటి ఆదివారపు టుదయం పెరట్లో తులసికోట దగ్గర కాలే పిడకల మీద మట్టికుండలో వండిన బెల్లప్పరమాన్నం చిక్కుడాకుల్లో యింటి సభ్యులమందరమూ ప్రసాదంగా ఆరగిస్తున్న సమయంలో సూర్యభగవానుణ్ణి ముందుగా మనసులో ప్రార్థించుకొని, అటుపైన నా మనసులోని మాట చెప్పాను.

“మన వేపు వాళ్ళేనా? మన వాళ్ళేనా?” అమ్మ సూటిగా ప్రశ్నించింది.

జిల్లా మారినా, జాతి మారినా అమ్మకు నచ్చదు. “మనది తూ.గో., వాళ్ళది ప.గో. – యింతే తేడా. మనవాళ్ళే కానీ కొమ్మ... అదే శాఖ వేరు. ఈ పరమాన్నంలో బెల్లంలా కలిసిపోతుంది!” అన్నాను నెమ్మదిగానూ, స్పష్టంగానూ. అమ్మ మౌనంగా ఉండిపోయింది.

“పంచదార, బెల్లం, తేనె, ఈమధ్యనే మార్కెట్లోకి వచ్చిన ఖర్జూరం కాన్సంట్రేటూ – అన్నీ పరమాన్నంలో కలిసిపోతాయి. అయితే బియ్యపు గింజలుడక్కపోవచ్చు, పాలు విరిగిపో

**ఎలక్ట్రాన్**

# వయస్సుమాని

వొచ్చు!" అంది కావేరి వదిన. ఆవిడ ఎమ్.ఏ. గృహశాస్త్రం. ఏ కళాశాల, ఏ విశ్వవిద్యాలయం అని అడక్కండి. దూరవిద్యావిధానంలో సాధిం చిన పట్టా అది.

అమ్మ వదినకేసి ఓసారి తీక్షణంగా చూ సింది. "నాకభ్యంతరం లేదు కానీ ఆ అమ్మాయి ఉద్యోగం మానెయ్యాలి. ఒకవేళ ఆ అమ్మాయి ఉద్యోగం మాన్నంటే నేను కాదంటానేమోనన్న భయం మట్టుకువద్దు. మరీ మీ ప్రేమకడ్డొచ్చే టంతటి దుర్మార్గురాల్ని కాను. మరోసంగతి – మీ సంస్థ వాళ్ళు తమంతతాముగా చేస్తే తప్ప నీ అంతటనువ్వుగా బదిలీకోసం ప్రయత్నించ కూడదు!" అంది నావైపు తిరిగి.

అమ్మ కావేరి వదిన హెచ్చరికని తోసిపుచ్చి, ఓ అత్తగా మాట్లాడింది. అమ్మలోని అమ్మగా మాట్లాడింది. వదినతో సమానస్థాయి గృహిణి గా ఉంచడం కోసం నేను ప్రేమించిన యువతి ఉద్యోగం చేయకూడదంది. కుటుంబ సామర స్యమే ఆమె ధ్యేయం. అయిదో తరగతి వరకే చదివినా అమ్మ గొప్ప మనస్తత్వ శాస్త్రవేత్త.

నాన్నగారికి, అన్నయ్యకీ ఎప్పుడు నోర్లు



మూసుకోవాలో తెలుసు. సూర్య ప్రసాదాన్నా రగిస్తూ అన్న ఆడవాళ్ళ మాటల్ని, మగవాళ్ళ మౌనాన్నీ సర్వసమ్మతంగా భావించి, ఉత్సా హంగా లేచాను. తర్వాత అదనుచూసి వదిన నన్నో పక్కగా తీసుకొనిపోయి, "నువ్వు నాకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. కావాలనే ఓ చిన్న అడ్డుపుల్ల వేశాను. నా నోరునొక్కడానికైనా మీ అమ్మగారవునంటారని నాకు ఖచ్చితంగా తెలు సు!" అంది.

"చాలా చాలా థాంక్స్ వదినా! నేనప్పుడే గ్రహించాను. అందుకని నీకు నా పెళ్ళిలో మంచి కానుక కొనిస్తాను" అన్నాను.

"కానుకలూ, గీనుకలూ వద్దుకాని, పెళ్ళ యిన తర్వాత నీకు వచ్చే మొదటినెల జీతంలో సగం మీ ఆవిడ చూస్తుండగా నాకివ్వు! అలా యిస్తానని ఒట్టెయ్యి!" అంది.

గొప్పలకిపోయి అడకత్తెరలో యిరుక్కు పోయాననిపించింది. అయినా వదినంటే అమ్మ తర్వాత అమ్మలాంటిది కదా? అందుకని 'ఒట్టు మీద ఒట్టు' అన్నాను. ఆరోజు సాయంత్రం నీళ్ళు లేని మా ఊరి చెరువుగట్టు పక్కన చెట్లూ, మొక్కలూ లేని పురపాలక సంఘం వారి ఉద్యా నవనంలో ఏ మాత్రపు మరుగూ లేని ఓ బీటలు వారిన సిమెంట్ బెంచీ మీద కాస్త ఎడంగా కూర్చుని, జాహ్నవికి నేనింట్లో సాధించిన విజయాన్ని గురించి చెప్పాను. 'ఏం చెప్పినా చెప్పుకాని, ఈ సంగతిమట్టుకు చెప్పొద్ద'ని వదిన మరో ఒట్టు వేయించుకొన్న కారణంగా సగం జీతం సంగతి గోప్యంగానే ఉంచేశాను.

అమ్మ విధించిన షరతుల్ని గురించి చెప్పి నప్పుడు జాహ్నవి "అలాగా?" అంది. అవున న్నట్లుగా తలూపాను. తనూ తల పంకించింది. స్వగతంగా అనుకొంటూన్నట్లుంటూనే పైకి అనే సింది. "అసిస్టెంట్ యింజనీరు భార్యగా ఉద్యో గం చేసినా పర్వాలేదుకాని, పదవీ విరమణ చేసిన ఐ.ఏ.ఎస్. ఆఫీసరుగారి కోడలిగా ఉద్యో గం చేయడం బావుండదు మరి!"

నా పదవి ఆమె ఉచ్చరించేటప్పుడు 'బోడి' అన్న పదాల్ని మింగేసి అన్నట్లనిపించింది. అం తటి ఐ.ఏ.ఎస్. ఆఫీసరుగారూ అయిదోక్లాసు చదివిన అమ్మ మాటకు ఎదురాడరని చెబ్దా మనిపించింది. కానీ నాన్నగారిని మరీ తీసిపారే సినట్లవుతుందని, ఆ సంగతి తనే స్వయంగా తెలుసుకొంటే మంచిదనీ ఆ ఊసెత్తలేదు. మరో కారణం కూడా ఉంది. ఐ.ఏ.ఎస్. అయిదో క్లాసుకి దాసోహం అన్నప్పుడు బోడి బి.యి. గాదు ఎమ్.సి.ఏ. అమ్మాయికెందుకు దాసోహ మనకూడదన్న బీజం జాహ్నవి మనసులో ముందే నాటుకుపోతుందన్న భయం కూడా వేసింది.

" 'మరి' అంటే ఎలా, 'సరే' అనేనా?" ఆదుర్దాగా ప్రశ్నించాను.

"చెన్నూరికి పొన్నూరెంతదూరమో, పొన్నూ రికీ చెన్నూరంతే దూరం! అదే... ఒకే కులమైనా మా శాఖంటే మీకెంత ఎలాంటి యిదో, మీ శాఖంటే మాకూ అంతే, అలాంటి యిది! మా నాన్న మహాచాదస్తం మనిషి. ఒప్పుకోకపో వచ్చు" అంది జాహ్నవి సీరియస్‌గా.

"అలా ఒప్పించగల శక్తి లేనప్పుడెందుకు ప్రేమించావు?" ప్రశ్నించాను.

"ఒప్పించే శక్తి లేకపోవచ్చుగానీ లేచిపోయే ధైర్యముందిగా?! మరీ ముందుగానే అంత దాకా పోవడం ఎందుకుగాని, మీ తల్లిదండ్రుల్ని వచ్చి మా తల్లిదండ్రుల్నడగమంటే సరి!" అంది జాహ్నవి.

"బండిని రివర్స్‌గేర్‌లో పెడ్తే ఎలా? అది

సాంప్రదాయవిరుద్ధంకాదా?"

"అసలు ప్రేమించడమనేదే సాంప్రదాయ విరుద్ధమైనప్పుడు యిదెంత? ఆడపిల్ల తండ్రే వెళ్ళి అడగాలన్నది సాంప్రదాయపు ముసుగులో చేసే తీరని అవమానం. మగవాడి తండ్రి వచ్చి అడగకూడదన్న కఠోరనియమం ఏమీ లేదుగా? గత వైభవం గల ఐ.ఏ.ఎస్. ఆఫీసరుగారొచ్చి, మరో మూడు నెలల్లో పదవీ విరమణ చేయబోయే ఎమ్.ఆర్.ఓ. గార్నడిగితే కాదనలేదు! మా యింట్లో మా నాన్న 'ఎస్' అంటే మరెవరూ నోరెత్తరు!"

"తప్పదంటావా?" కాస్త నిరుత్సాహంగా ప్రశ్నించాను. తప్పదన్నట్లుగా తలాడించింది.

"పోనీ ఓ పనిచేద్దాం. నాతో నువ్వొచ్చి, మా నాన్నగారి ముందు మన ప్రేమని గురించి వెల్లడించు. ఆ సమయంలో మా అమ్మ ఆ పరిసరాల్లో లేకుండా నేను చూస్తాను. సహృదయంతో అంగీకారమిచ్చిన ఆయన్ని ఆకాశంలోకి ఎత్తేసి, మీ యింటనున్న అవరోధం గురించి వివరించు. మా నాన్నగారొచ్చి మాట్లాడతారు. మీ నాన్నగారి 'యిగో' గో...గో... అయింతర్వాత ఊరికే శాస్త్రానికి మీ అమ్మగారితో సహా వచ్చి మా తల్లిదండ్రులతో మాట్లాడమను. సాంప్రదాయం పాటించినందుకు మా అమ్మ సంతోషిస్తుంది, సమాజమూ తప్పు పట్టదు. ఈ రాజీ మార్గం మనిద్దరికీ మంచిదికదా?" అన్నాను.

ఏ కళ నుందో 'బావుంది' అంది. మరో మాట కూడా అంది. "మా నాన్న పదవిలో ఉండగానే వివాహం జరిగిపోతే చాలా ఖర్చులు కలిసొస్తాయి! అన్నట్టు కట్నం సంగతేమిటి?"

"మా నాన్నగారాదర్శవాది. అన్నయ్యకి కానీ కట్నం తీసుకోలేదు. కట్నం తీసుకొంటే మనది ప్రేమ వివాహం కానట్టే లెఖ్ఖ! 'కట్నం తీసుకోకుండా చేసుకొంటామంటున్నారు, కుర్రాడిలో లోపమేదైనా ఉందేమో వాకబు చెయ్యండ'ని మీ నాయనమ్మా, అమ్మమ్మా బుగ్గలు నొక్కుకోకుండా చూడు!" అన్నాను. అప్పుడప్పుడూ అతివాగుడు మంచిదికాదు.

ఇందులో సినీ నటీనటుల, దర్శకుల వగైరా అడ్రసులు, ఫోన్ నెంబర్లు కలవు.
ఫిలింగైడ్
కావలసిన వారు
వై.కె. మూర్తి
దాసరివారివీధి
విజయవాడ - 2 కు
20 రూపాయలు M.O చేయండి

"అలా అనుకోవడంలో వాస్తవం లేకపోలేదు గాని, ఆ బెంగ పడవలసింది నేను కానీ... వాళ్ళు కాదు!" అంది జాహ్నవి.

"ఎల్లుండి పని మీద 'అరకు' వెళుతున్నాను. నువ్వూ అక్కడికి ఏదో వంకన రా. యిదీ సాంప్రదాయ విరుద్ధమే అయినా నీ అనుమానం తీరాలంటే మార్గాంతరం లేదు" అన్నాను కొంటెగా.

"కట్నం ప్రసక్తి ఉన్నా, లేకపోయినా కాబోయే భర్త గురించి ప్రతి స్త్రీ ఈ విషయమై ఆలోచించకమానదు. అయినా మన సంభాషణ కాస్త పెడతోవపడ్తోందనుకొంటాను... యింతటితో ఆపేస్తే మంచిది" అంది జాహ్నవి సీరియస్‌గా.

మహా నాటకంలో అంతర్నాటకంలా నేను వేసిన పథకం మా నాన్నగారి దయవల్లా, జాహ్నవి నాన్నగారి సహకారం వల్లా దిగ్విజయంగా నెరవేరింది. అమ్మ చాలా సంతోషంగా తన పూర్తి అంగీకారాన్ని తెలియజేసింది. భార్యాభర్తల జీవనసౌధం సుఖసంతోషాలతో శోభిల్లాలంటే, ముందస్తుగా అత్తా కోడళ్ళ అను

బంధం అదేదో సిమెంటులాగా చాలా గట్టిగా ఉండాలి.

పుట్టిన సమయాల్లో, తేదీల్లో ఏ పాటి నిజాలున్నాయో కన్నతల్లికి, పురుడు పోసిన డాక్టరమ్మకీ తెలియాలి కాని, జాతకాలు మట్టుకు బ్రహ్మాండంగా ఉన్నాయని, కుదిరాయనీ యిరు వైపుల జ్యోతిష్య బ్రహ్మలూ, జాతక దురంధరులూ చెప్పేశారు. అలా చెప్పించడంలో 'జాతక సంయోగదానంగా' కొంత ఘనంగానే నేను సమర్పించుకోవలసి వచ్చింది. ఆ దానాన్ని స్వీకరించి శాస్త్ర ద్రోహం చేసినందుకు వాళ్ళు కళ్యాణయంత్రం ముగ్గుపెట్టి, నూటెనిమిదిసార్లు కళ్యాణదేవత మంత్రాన్ని జపించి, ప్రాయశ్చిత్తంగా ఆ రోజల్లా ఉపవాసముండాలిట. అవన్నీ చేశారో లేదో నాకు తెలియదుగానీ మా పెళ్ళి సవ్యంగా జరిగిపోయింది. పెళ్ళెందుకు చేసుకొంటామో అదీ దివ్యంగా జరిగిపోయింది.

పెళ్ళయిన పదోరోజున ఒకటోతారీఖు వచ్చేసింది. ఆ సాయంత్రం అయిదువేల రెండొందల పాతిక రూపాయలు జాహ్నవి చూస్తుండగా కావేరి వదిన చేతికి 'సగం-జీతం' అంటూ అందించాను. జాహ్నవి అప్పుడు ప్రశ్నార్థకంగా చూసి, ఆ రాత్రి ప్రశ్న వేసింది. "మా అమ్మ మీద 'మనోవైజ్ఞానికదబావ్' అనే అస్త్రాన్ని ప్రయోగించి మన పెళ్ళికి సుముఖంగా చేసింది. అందుకు బహుమానంగా ఒక్కటంటే ఒక్క నెల జీతంలో సగం యిమ్మంది" అని సమాధానమిచ్చాను.

నమ్మిందో లేదో తెలియదుగానీ ముభావంగానే కౌగిట్లోకి వచ్చింది. ముడుచుకొన్న పెదాల మీద అమృతం లభించలేదు.

మర్నాడు సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే "అక్కయ్యగారు చాలా మంచివారు!" అంది జాహ్నవి ఆనందంగా.


"అభిప్రాయం మారినట్టుగా ఉంది. ఏమా కథ?" అని ప్రశ్నించాను.

ఆ కథేమిటో హరిద్వార్ దగ్గర పరుగులెత్తే గంగలా ఉత్సాహంగా చెప్పింది. అక్కడి గంగ నీటిలాగే కల్మషం లేని మనసుతో చెప్పింది.

కావేరి వదిన ఆ అయిదువేల రెండు వందల పాతిక రూపాయలూ అమ్మ చేతికిచ్చి, 'కొత్త పెళ్ళికూతురు వంట చేయడానికి వీలుగా కట్టుకొనే నూలు చీరలు కొనమన్నాడు మరిది. తనే మిమ్మల్నడిగితే తిడ్తారని భయపడి, నా చేత యిప్పించి మిమ్మల్ని ఒప్పించమన్నాడు', అందిట.

అమ్మ యిద్దర్నీ బజారుకి తీసుకుపోయి ఒక్కొక్కటీ అయిదూ - ఆరు వందల మధ్య ఖరీదు చేసే తొమ్మిది చీర్లని, ఆ మొత్తంలో జాహ్నవికి నచ్చినవీ, నప్పినవీ కొన్నదట. అంతే కాదు 'యింటికి పెద్దకోడలివి, నువ్వేం పాపం చేశావని? చిన్నవాడికున్న జ్ఞానం పెద్దాడికి లేకపోయింది. పెద్దాడి దగ్గర వసూలు చేస్తాన్లే!' అని వదినకీ అంతే మొత్తంలో మరో తొమ్మిది చీరలు కొందట. యింటికి తిరిగి వచ్చిన తర్వాత 'చిన్నాడు మాట వరసకి వంట చీరలన్నాడు గాని, యివన్నీ పండగల్లో కట్టదగ్గ వాసి చీరలు. వచ్చే దేవీ నవరాత్రులకి రోజుకో కొత్త చీర కట్టండి. అంతవరకూ జాగ్రత్తగా దాచుకోండి' అన్నదట.

అటు తర్వాత కావేరి వదిన జాహ్నవికి హితబోధ చేసిందట. 'అయిదో క్లాసు చదివినా అత్తయ్యచాలా తెలివైంది. అప్పుడప్పుడూ మాట కొంచెం కరుగ్గా ఉన్నా మనసు మట్టుకెప్పుడూ చిలికిన వెన్నే! యింటి కోడళ్ళం కాబట్టి నీకూ, నాకూ వంట చేయకతప్పదు. సింథటిక్ చీరలు




కట్టి వంటచేస్తున్నప్పుడు ప్రమాదాలు సంభవించడానికి అవకాశమెక్కువ. అలాంటి దుర్ఘటన కనక జరిగితే ఎంతటి మంచివాళ్ళైనా అత్తమామల్ని, ఎంతటి బుద్ధూలైనా భర్తల్నీ అందరూ ముందుగా అనుమానిస్తారు. పండగలింకా నాలుగైదు నెలలున్నాయి. ఈ లోపుగా పేరంటాల వంకా, ఆ వంకా, ఈ వంకా, అవకాశమొచ్చినప్పుడల్లా ఒక్కో చీర కట్టేయడం మంచిది. లేకపోతే అనుకోకుండా యింటికేముత్తయిదువ చుట్టపుచూపుగా వచ్చినా ఓ చీర గోవిందా!'

కావేరి వదినకి ఏ విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఏ. పట్టా వచ్చిందీ ముఖ్యం కాదు కాని, చాలా తెలివైందన్న మాట మట్టుకు ముఖ్యం. నన్నడ్డుగా పెట్టుకొని, నా చేత ఖర్చు చేయించి జాహ్నవికి ఆప్తురాలైపోయింది. అమ్మ అన్నయ్య దగ్గర డబ్బు వసూలు చేసినా, చేయకపోయినా ఈ చీరల వ్యవహారంలో తనూ లబ్ధి పొందింది. చీరలసాకుగా వంతుల వారీగా వంట చేయడం యింటి కోడళ్ళ బాధ్యత అని జాహ్నవికి మహా తెలివిగా తెలియజేసింది. అంతేకాదు... నేనూ, అన్నయ్యా బుద్ధూలమని మాటల్లో పరోక్షంగా ఓ విసురు విసిరింది.

జాహ్నవి యింత లోతుగా ఆలోచించిందో లేదో తెలియదుకాని, నేను పొరబాటున కూడా వదిన తెలివితేటల్ని జాహ్నవి ముందు మెచ్చుకోదలచుకోలేదు. అయితే యిదే అదనుగా జాహ్నవితో ఓ మాటన్నాను. "యింటి పన్నులు, టెలిఫోను, కరెంటు బిల్లులు - వీటి చెల్లింపులు మినహాయించి, మిగిలిన యింటి ఖర్చులన్నీ తన చేతుల మీదుగానే జరిగితే అమ్మకెంతో సంతృప్తి. షాపింగ్ అంటే ఎంతో సరదా. నెల మొదట్లో నాన్నగారు, అన్నయ్య, నేనూ కొంత డబ్బు అమ్మ అలమార్లో ఉంచేస్తాం. కానిచోట పైసా ఖర్చు పెట్టదు, అవసరమైన చోట ఖర్చుకి వెనుకాడదు. సరైన భాష్యం కాకపోవచ్చు, కృత్రిమంగా కనిపించవచ్చు - యింటి యిల్లాలికీ పాటి ఆర్థిక స్వాతంత్ర్యమివ్వాలని నాన్నగారి

ఉపదేశం".

"బాగానే ఉంది. మారి మా మాట?" జాహ్నవి ప్రశ్నించింది.

"అన్నయ్యేం చేస్తున్నాడో నాకు తెలియదు గాని, బీరువాలో ఓ అరలో నీకోసమూ నేను కొంత డబ్బుంచుతాను".

"మిగిలింది?" జాహ్నవి ప్రశ్నించింది. ఘటికురాలు.

"బ్యాంక్‌లో జమ" అన్నాను.

"అయితే ఆ ఎక్కౌంట్‌ని జాయింట్ ఎక్కౌంట్‌గా వెంటనే మార్పించండి. అన్నట్టు మీ పోకట్ మనీ సంగతి?" అదోలా చూస్తూ అడిగింది.

"బీరువాలోని నీ అరలోంచే!" అన్నాను.

"అభ్యంతరం లేదుగానీ కావల్సినప్పుడల్లా అడగండి. నేనే తీసియిస్తాను. అయితే ఓ నెలలో మీరు ఖర్చు చేసిన పోకెట్ మనీ మరుసటి నెల మీరుంచే డబ్బుకి అదనంగా కలిపి ఉంచాలి!" అంది జాహ్నవి తెలివిగా.

"ఓ నిరభ్యంతరంగా! పోతే చిక్కేమిటంటే నెలనెలా బ్యాంక్‌లో పొదుపు చేసే డబ్బు ఆ మేరకు తగ్గిపోతుంది!" అన్నాను నవ్వుతూ.

"ఉన్న ఉద్యోగం మాన్పించి, మీరిచ్చే ఆర్థిక స్వాతంత్ర్యమిదా?! నాకంటే మీ అమ్మగారే అదృష్టవంతురాలు. నేనే ఖర్మకాలి మీ ప్రేమలో పడ్డాను!" అంది జాహ్నవి. ఆ మాటల్లో నన్ను డికించాలనే తపన తప్ప, మా యింటి గడపలో కాలుపెట్టినందుకు అసంతృప్తి ధ్వనించలేదు.

'హమ్మయ్య!' అని మనసులో అనుకొని, "పండగలు త్వరగా వస్తే బావుండును!" అన్నాను పైకి.

"ఏం, ఎందుకని?"

"రోజుకోశారీ విప్పితే వెరైటీగా ఉంటుంది కదా?!" మాటల్లో కాస్త రసికత్వం చూపి మస్కా కొద్దామని ప్రయత్నిస్తూ అన్నాను చిలిపిగా.

"రోజుకోశాల్తీ మరీ బావుంటుందేమో?" అంది కొంటెగా.

'ఎవరికి?' అని అడిగే వీల్లేకుండా మనిషిని నిలువుగా చీల్చే బాణం విసిరింది. అయినా తిరుగు సమాధానం యివ్వకపోతే నా పరువు పోతుంది. "ఆ అవసరం లేదు... శాల్తీ ఒకటే అయినా తొమ్మిది అవతారాలూ నీవేగా!" అన్నాను.


"ఏమిటో అనుకొన్నాగాని అక్కయ్యగారన్నట్టు మీరు మరీ అంతబుద్ధూలు కారు!" అంది జాహ్నవి.

అంత బుద్ధూలు కాదంటే కొంత బుద్ధూననేగా అర్థం? ఈ తోడికోడళ్ళిద్దరూ యిలా కలిసిమెలిసి ఉంటే అమ్మా, నాన్నలకానందం. గృహమొకనందనవనం. అందులోని వెర్రివెధవాయిలం నేనూ, అన్నయ్యానూ! అయినా, కాకపోయినా అలా ప్రవర్తిస్తే, కట్టుకొన్న ఆడవాళ్ళకంతకంటే కావల్సిందేముంది?

ఓ రోజు సాయంత్రం యిల్లు చేరేసరికి కావేరి వదిన, జాహ్నవీ - యిద్దరూ హాల్లో కూర్చుని నా కోసం ఎదురుచూస్తున్నారు. నన్ను చూస్తునే "మరిదీ! ఓ ముఖ్యమైన విషయం చెప్పాలి కూర్చో" అంది వదిన కాస్త గట్టిగానే. అంటే అమ్మా, నాన్నా యింట్లో లేనట్టే. ఏ గుడికో వెళ్ళుంటారు.

"ఓ కప్పు కాఫీ యిచ్చి, తాగే వరకూ ఆగలేరా?" అని నీరసంగా ప్రశ్నించాను.

ఆ రోజు ఆఫీసులో ఓ చిన్న తలనొప్పి వ్యవహారం జరిగింది. పని సక్రమంగా జరగని




కారణంగా, నా కంటే వయసులో పెద్ద, హోదాలో చిన్నా అయిన ఓ ఉద్యోగిని గట్టిగా మందలించవలసి వచ్చింది. అతగాడి ఆత్మాభిమానం దెబ్బతిని, నలుగుర్నీ పోగేసుకొని, వయసు ప్రాతిపదికగానైనా గౌరవమివ్వకుండా తనని అవమానపరిచినట్టుగా పెద్దగొడవ చేశాడు.

"అంకుల్! మిమ్మల్ని వృత్తిరీత్యా, విధి నిర్వహణ దృష్ట్యా మందలించానే కానీ నిందించలేదే? అయినా మీ మనసు గాయపడిందంటున్నారు కాబట్టి వీరందరి ముందూ క్షమార్పణలు కోరుకొంటున్నాను. అయితే మీ పనినట్టు పడినప్పుడల్లా, అనుభవం తక్కువైనా వయసులో మీకంటే పెద్దవారినెవర్నైనా చూసి, వారిచేత మీకు చెప్పిస్తాను. లేకపోతే మార్గాంతరం చూపించండి" అన్నాను కూల్‌గా, రంభా, గోవిందల కేశతైల ప్రకటన గుర్తుకొచ్చి.

ఆయన నాకంటే ఓ అయిదారేళ్ళే పెద్ద. 'అంకుల్' అనడంతో బిక్కచచ్చిపోయి నెమ్మదిగా కదిలాడు. ముంబయ్‌లోని చెంబూర్ మార్కెట్లో యిరవై ఏళ్ళ యువతీ యువకులు సంచీలు పట్టుకొని వెళ్తే, నలభై ఏళ్ళకొట్ల వాళ్ళు కూడా 'ఏం కావాలి అంకుల్, ఆంటీ...?' అని అడుగుతారు.

ఆ గొడవతో కాస్త తలనొప్పి వచ్చింది. 'కాఫీ' అన్నా వీళ్ళు వినిపించుకొనేపరిస్థితిలో లేరు. "సరే చెప్పండి" అంటూ సోఫాలో కూలబడ్డాను.

"మరిదీ! నువ్వు మీ అన్నయ్యకన్నా మూడేళ్ళు చిన్న. నేనేమో రెండున్నరేళ్ళు చిన్న. అంటే నేను నీకంటే ఆర్నెలు పెద్ద. అదీకాక ఈ యింటికి పెద్ద కోడల్ని. అవునా, కాదా?" కావేరి వదిన ప్రశ్నించింది.

"యిందులో సందేహమేముంది?" ప్రశ్నతో జవాబిచ్చాను.

"యివ్వాళ మీ ఆవిడగొప్పకిపోయి తన విద్యార్హతల ధృవపత్రాలనన్నిటినీ చూపించింది.

పదోక్లాసు పాసయిన ధృవపత్రంలో సూచించిన పుట్టిన తేదీ ప్రకారం మీ ఆవిడ నాకంటే ఆర్నెల్లు పెద్ద. అంటే జాహ్నవి నీకంటే ఏడాది పెద్ద! అవునా, కాదా?" వదిన మరింత ధాటీగా ప్రశ్నించింది.

"అయితే...?" ఆగాను. ఆఫీసులో సమస్యే యింకో రూపంలో యిక్కడా ప్రత్యక్షమైంది. ఆఫీసు నుంచి తెచ్చుకొన్న తలనొప్పి మరింత ఉధృతమైంది.

"మీ వదిన నన్ను 'అక్కా' అంది. ఆ పక్షం లో పెద్ద కోడలి అజమాయిషీ హక్కులన్నీ నాకు ధారాదత్తం చెయ్యమన్నాను, అంతే!" అంది జాహ్నవి.

ముఖ్యమంత్రి లేదా ప్రధాన మంత్రి చిన్న వాళ్ళైనా సీనియర్ మంత్రులు కూడా వారి మాట వినకతప్పదు. గృహరాజ్యాంగం కూడా యిందుకు విరుద్ధం కాదు. పెద్దన్నగారి భార్య వయసుతో నిమిత్తం లేకుండా పెద్ద కోడలి హోదా సంపాదిస్తుంది. ఆ మాట జాహ్నవికి తర్వాత నెమ్మదిగా నచ్చచెప్పాలి. యిది సమయం కాదనిపించింది. కానీ మరో మాట అడగకుండా ఉండలేకపోయాను. "అంటే జాతకంలో యిచ్చిన తేదీ...?" నసుగుతూ ఆపేశాను.

"రైటో, రాంగో నాకు తెలియదు. ధృవపత్రాల్లో ఉన్న తేదీ తప్పో, ఒప్పో నాకు తెలియదు. అయినా అదే అధికారపూర్వకంగా నా పుట్టినతేదీ. పెద్దకోడలి హక్కులు మీ వదినకి కావాలంటే ఆవిడ ఎప్పుడూ, ఎల్లప్పుడూ నన్ను 'చెల్లీ' అనే పిలవాలి!" అంది జాహ్నవి.

"ఈమాట బయటకు పొక్కితే వరహీనం అంటూ మీ అమ్మగారు చిందులు వేస్తారు! ఆ నోటా ఈ నోటా ఊరంతా పాకి కుటుంబగౌరవానికి హాని చేస్తుంది. అందుకని వయసులో చిన్నదాన్నైనా, త్యాగబుద్ధితో నాకంటే వయసులో పెద్దయిన జాహ్నవిని చెల్లీ అని పిలుస్తాను, ప్రామిస్! మరి నీ సంగతేమిటి మరిదీ?" కావేరి వదిన తమ సమస్యకి పరిష్కారం చెప్పేసి, నా ముందరో సమస్యనుంచింది. నా సంగతి ఏమిటో అర్థం కాసాగింది.

"నా సంగతా...?" అటు తర్వాత ఆలోచనలో పడిపోయాను. యిద్దరూ నా వైపు తదేకంగా చూడసాగారు. ఏదో సమాధానం చెప్పి బయటపడాలి. "ఏకాంతంలో నన్నెలా పిల్చినా, ఏం చేసినా నోరెత్తను. నలుగురిలో మట్టుకు సాంప్రదాయం పాటించండి జాహ్నవి గారూ!... అయినా వయసులో చిన్నయినా ఎంత మంది భార్యలు భర్తల్ని కాల్చుకుతినటం లేదూ?!" అన్నాను లేని నవ్వు తెచ్చుకొంటూ.

ఆ నవ్వులో నా రోదన విన్పించింది కాబోలు... తోడికోడళ్ళిద్దరూ గలగలా నవ్వారు. ఆ నవ్వులు పురుషాధిక్యతకు సమాధి కట్టినట్లనిపించింది. ఆ నవ్వులు జీవితాంతమూ నన్ను బెదిరించి, సాధించే విజయహాసాల్లా వినబడ్డాయి. ఎంతో తెలివైనవాణ్ణని అనుకొన్న నేను నా కంటే ఏడాది పెద్ద దాన్ని ప్రేమించడం అపరాధం కాదనుకొన్నా - ప్రేమ గుడ్డిదని, అన్నలున్న వాడు వదినెల కంటే వయసులో చిన్నదాన్ని ప్రేమించాలనీ ఆలశ్యంగా గ్రహించాను. అయితే వయసు విషయంలో ఆడవాళ్ళు చాలా సెన్సిటివ్ కాబట్టి జాహ్నవి తను నా కంటే ఏడాది పెద్దదని ఎట్టి పరిస్థితుల్లోనూ, ఎవరితోనూ చెప్పదన్న ధీమా నాకుంది. ఉద్యోగం కనుక కంటిన్యూ చేసి ఉన్నట్లయితే తను నా కంటే ముందు రిటైరై ఉండేదనేది వేరే విషయం!